# లంకలో లేడిపిల్ల

గోదావరి దాటి అవతలి ఒడ్డుకు వెళ్ళడానికి ఒక లంక అడ్డం వుంది. దాని పొడుగు రెండు మైళ్ళు. కావడానికి రెండు మైళ్ళేగాని—గడవడానికి రెండు వందల మైళ్ళ పెట్టు. భారత సార్వభౌముడైనా సరే ఆవలి ఒడ్డుకు చేరాలంటే పంచ ఎగ్గట్టి నడవవలసిందే. అయితే పరివారం పల్లకీ తెస్తాం మహారాజా అనవచ్చు. కాని ససేమిరా ఎక్కనంటాడు. ఒట్టేసి చెప్పగలను. ఆయనెక్కడు. ఎందుచేతనంటే ఆ లంక చూస్తూ నడవడం ఒక గొప్ప అనుభవం!

వరద రోజుల్లో బాగా ఒండ్రుపట్టి ఆ లంక ఒరగబండుతుంది.

పచ్చని దోస తోటలు, ఎర్రని మిరప గుబురులు, ఆకుపచ్చని పుచ్చకాయల దొంతరలు—వారలంట నిండు చూలాండ్రలా గెలలతో వంగిన మొక్క కొబ్బరిచెట్లు-నన్నే చూడమన్నట్టుంటాయి.

మళుపుల్లో దెయ్యాల్లాంటి సీమ చింతచెట్ల కొమ్మలకు తగులుకుని పల్లకీ ఇక వెళ్ళననడం అలా ఉంచుదాం.

ఎర్రని పట్టు చప్లా, ఖరీదైన కోటూ, ముఖమల్ చెప్పులూ వేసు

కుని ఒక బడాబాబు నావ దిగి పరివారం తెల్లబోతూండగా "నడవ నివ్వండి హాయిగా. వెధవ లాంఛనాలు. మీరూను" అని కసిరి, పట్టు మడతల్లాంటి ఇసకతిన్నెలమీద చకచకా నడిచి వెళ్ళాడు, ఒకమాటు—

ఆ లంకలో పెద్ద మోతుబరీ రైతు మా నారయ్య కాపు. కిర్రు చెప్పులు, బుంగ మీసాలు, ఒదులు తలపాగా—అతని రాజ లాంఛనాలు.

చూడడానికి ఎంత పులో, చేరడానికి అంత చెలి!

మా ముత్తాతలనాటి భూమి హరించిపోయింది పోగా మిగిలినవి రెండెకరాలు. తండ్రికీ, పినతండ్రికీ తగాదా లేకుండా చెరో ఎకరం తెగిపోయింది.

నారయ్యకాపుకి మా నాన్న పెదబాబు, చిన్నాన్న చినబాబు. చిన్నాన్న జులాయిగా తిరిగి తన యెకరం అమ్ముతానంటే—బాధపడుతూ నారయ్యకాపే కొన్నాడు. నాన్న యెకరం బిక్కు బిక్కుమంటూ మిగిలివుంది.

"పెదబాబూ, నీ యెకరం అమ్మకు! నీ శిస్తు పువ్వుల్లోపెట్టి పంపుతాను" అన్నా, ఎర్ర మిరప్పళ్ళల్లో పెట్టి పంపేవాడు.

ఒకసారి శిస్తు వసూలికి నాన్న నన్ను పంపాడు. నా కప్పుడు 21. చిన్న ఉద్యోగం చేస్తూ రాజమండ్రిలో వుండడంవల్ల ఆ వసూలు నా పాలబడింది.

నావ దాటి వెళ్ళేసరికి సాయంత్రం అయింది. నారయ్య ఇంటి దగ్గరే వున్నాడు. అంతకుముందే వాళ్ళింట్లో పెళ్ళి జరిగిందిగాబోలు. ఇంటిముందు పెద్ద పందిరీ తోరణాలు అట్టహాసంగా వున్నాయి.

"బుల్లి బాబొచ్చాడే!" అంటూ అల్లంత ముఖం చేసుకుని వాకిట్లో పెద్ద పట్టెమంచం వాల్చి చాకింటి దుప్పటీ పరిచి కూచోమన్నాడు.

కుశల ప్రశ్నలయ్యాయి. భోజనం ప్రశ్న. లంకలో ఆరముగ్గిన నాలుగు జామపళ్ళు, నేయి, పంచదారలో మాగిన రెండు పూత చుట్టలు, పెద్ద వెండిగ్లాసుడు పాలూ "ఏరా యెంకన్నా" అనే ఒక ఉరుసుతో ఒరిగి ఒరిగి యెదటి బల్లమీదకు వచ్చి కూర్చున్నాయి.

నారయ్యా కాపు పిలుపుకి ఇల్లు అదిరిపోతుంది. నాయకుడే నాయుడయ్యాడు. కాచేవాడే కాపు. నారయ్యాకాపు ఆ వూరికి బొమిడికంలేని రాజు! "బ్రాహ్మణీకం" చెడకుండా ఫలాహారం అయింది. గోదావరి జోలపాటతో నిద్ర పట్టేసింది.

తెల్లవారింది.

గోదావర్లో ఈది ఎన్నాళ్ళయిందో! పొలాల్లోంచి అడ్డపడి గోదావరి పాయవైపు నడుస్తున్నాను. ఏపుగా పెరిగిన జొన్నచేను దగ్గర ఒక చక్కని లేడి చెంగలి మేస్తోంది. నారయ్యా పెంచుతున్నాడు గాబోలు! ఎప్పుడూ చూడనేలేదు.

ఎంత అందమైన లేడి! చిన్న కొమ్ములు, పొడుగాటి కాళ్ళు, తళ తళ మెరిసే పెద్ద కళ్ళు. ఆ కళ్ళ అందం చూస్తూ దానివెంట యెన్నాళ్లైనా తిరగొచ్చు.

"ఐణమాంస మబలా చ కోమలా"

మాంస మంటే కంపరమెత్తింది. రుచిమాట దేవు డెరుగును.

మాంసం మాట తలుచుకుంటే - దాని జాలి జాలి చూపులు జ్ఞాపకంవచ్చి జలజల కన్నీళ్ళు కారవా?

అయితే నాజూకైన కోమలితో జోడించి చెప్పడం మాత్రం వాడెవడో గొప్ప రసికుడై వుండాలనిపించింది.

ముద్దొచ్చి దాని వెన్ను నిమరబోయాను. చెంగున జొన్న చేలోకి దూకి పరిగెత్తింది. సందేహించకుండా వెంటపడ్డాను.

ఒక లేడి వెంటపడి నానా కష్టాలూ తెచ్చుకున్న వాడి కథ నిత్యం చదువుతుంటాను, అయినా జీవుని ఆంతర లక్షణం వేరు. వాడి పై చదువు వేరూ కాబోలు! ఆ అందాన్ని ఒదులుకోలేక మనస్సు హృదయాన్ని అణచి పరుగెత్తుతోంది.

ఆ పరుగు జొన్నచేను కవతల ఒక పూరింటి ముందు తేలింది. పూరింటి ముందు ఒక చెట్టునీడలో పదహారేళ్ళ పిల్ల డొక్కానార మడుతోంది.

అరే! లేడి ఏమయింది? పరుగెత్తి పరుగెత్తి ఆ లేడి ఈ 16 ఏళ్ళ అడపిల్లగా మారిపోయిందా?

అవే కళ్ళు! అదే చురుకు! అదే ఒంటి నాజూకు మెత్తన? "సూర్యకాంతం!"

యెవరిదో పిలుపు! పిల్ల తలెత్తి చూసింది. కళ్ళు మరీ మెరిశాయి! యెంత చక్కని పేరు! భాష ఏదైతేనేం?

లేడికి 'లేడీకి' యెంత దగ్గర?

సూరీకాంతానికి జార్జెట్ వోణీ, టెర్లిన్ పావడా లేవు. పని చేసిచేసి తల చెదిరి వుంది. చవకరకం పువ్వుల పరికిణీ, మాసిన ఆకుపచ్చ వోణీ; అయినా పల్లెని యౌవనం కోణార్క శిల్పంలా నిగనిగలాడుతోంది.

నన్నుచూసి ముందు ఆశ్చర్యపడి వోణీ సవరించుకుని తెల్లగా నవ్వింది. పాల చినుకులు పేర్చినట్టున్న ఆ పళ్ళు తళ తళలాడాయి.

"యెవరికోసం?" మెరిసే కళ్ళెత్తి అడిగింది.

ఔను "యెవరికోసం" ఆ మాట రెండు కొండలమధ్య లోయ లోలా నా మనస్సులో ప్రతిధ్వనించింది.

ఔను. యెవరికోసం?

"నన్ను నిరంతరం దహించే సౌందర్యక్షుధకోసం" అని చెప్పనా?

"దొరకని అందంకోసం పరిగెత్తే పిచ్చితనం" అని చెప్పనా?

"తోవ తప్పిన బాటసారి" నని చెప్పనా?

"లే....డి....కోసం" నోరుజారి అనేశాను.

పకపక నవ్వుతూ, "మీ యెర్రిగాని అది దొరకదు బాబూ!" అని సూరీకాంతం పాకలోకి వెళ్ళిపోయింది.

"శివోహం, శివోహం"

గోదావరివైపు చరచరా నడిచి వెళ్ళిపోయాను.